ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
MHR TV
మెదక్ సంపుటి: 19 సంచిక : 142 ఆదివారం 25, జనవరి 2026 పేజీలు: 06 వెల: రూ.1
Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com

## ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం అత్యంత దుర్మార్గం

**ఇతరుల వ్యక్తిగత జీవితాల్లో తొంగిచూడటం ఏ సంస్కృతి?**
**సూత్రధారులు, పాత్రధారులు ఎవరో తేలాల్సిందే**
**ప్రజల గోప్యతను తుంగలో తొక్కిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే**



హైదరాబాద్, (ప్రజాస్వరం):
ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన అప్రజాస్వామిక విధానాలపై పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శనివారం ప్రజా భవన్ లో ..మిగతా 3లో

## ఆయన వెనక ఎవరో ఉన్నారు



**ఆస్తుల కోసం విషపు రాతల**
**సైట్ నిబంధన ఎప్పుడో ఉంది**
**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

హైదరాబాద్, (ప్రజాస్వరం):
సింగరేణి టెండర్ల వివాదంపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండిపడ్డారు. విమర్శలకు కారణమైన 'సైట్ విజిట్' నిబంధన తమ ప్రభుత్వం తెచ్చింది కాదని, 2018లోనే కోల్ ఇండియా దీనిని ప్రవేశపెట్టిందని ఆధారాలతో సహా బయటపెట్టారు. 2021లో ఈ నిబంధనలు ఖరారైనప్పుడు తాము అధికారంలోనే లేమని, కావాలనే కొందరు రాబందుల్లా సంస్థ ఆస్తుల కోసం తప్పుడు రాతలు రాస్తున్నారని మండిపడ్డారు. ప్రజల్లో అపోహలు ఉండకూడదనే ఉద్దేశంతోనే నైనీ కోల్ బ్లాక్ టెండర్లను రద్దు చేశామని.. ..మిగతా 3లో



# టార్గెట్ ఫిక్స్..?

**ఒకరి వెనక మరొకరు..?**
**ఇప్పుడు భట్టి వంతు**
**పేర్లు చెప్పకుండానే అగ్గి**
**సీఎం, మంత్రుల మధ్య చల్లారని నిప్పు**
**తెర వెనక ఉన్నదెవరు..?**
**ఆఫ్ ది రికార్డుగా విమర్శలు**
**మంత్రులకు కూడా జిల్లాల్లో వ్యతిరేకులు**
**సీఎంకు అనుకూలంగా**
**మారుతున్న మంత్రుల వివాదాలు**

హైదరాబాద్, (ప్రజాస్వరం):
రాష్ట్ర కేబినెట్ లో వివాదాలు చల్లారడం లేదు. ఒకరి వెనక మరొకరు.. ఇలా మంత్రులు ఏదో ఒక అంశంలో సీఎం టార్గెట్ గా విమర్శలు చేస్తూనే ఉన్నారు. ఒక ఇష్యూని బేస్ చేసుకుని తుదకు సీఎం దగ్గరకే విమర్శలు తీసుకు వస్తున్నారు. తాజాగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా రోడ్డెక్కారు. ఓ మీడియా సంస్థ అధినేత ముసుగులో సింగరేణి వివాదంపై చివరకు సీఎం రేవంత్ రెడ్డి దగ్గరకే వచ్చారు. అయితే, ఎక్కడా పేరు, హోదా చెప్పకుండానే అందరికీ అర్థమయ్యేలా విమర్శలకు దిగారు. దీంతో తెలంగాణ మంత్రి మండలి చుట్టూ గతంలో ఎన్నడూ లేనంతగా చర్చలు, వివాదాలు జరుగుతున్నాయి. తాజాగా ఒకేసారి ఇద్దరు మంత్రులపై రెండు ప్రముఖ మీడియా సంస్థలు రాసిన కథనాలే కారణంగా సీఎం చుట్టూరా వివాదాలు అల్లుకుంటున్నాయి. నల్గొండ జిల్లాకు చెందిన మంత్రి అంటూ పేరు ప్రస్తావించకుండా ఆయన వ్యక్తిగత అంశంపై ఓ కథనం ప్రసారం చేయడం.. దానిపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ..మిగతా 2లో

## అందరి బాగోతాలను బయటపెడతాం

**ఫోరెన్సిక్ ఆడిట్‌తో సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో అక్రమాల గుర్తింపు**
**త్వరలో 31 జిల్లాల్లో కూడా ఫోరెన్సిక్ ఆడిట్**
**ధరణి పోర్టల్ లోసుగులతోనే రిజిస్ట్రేషన్‌లలో అక్రమాలు**
**9 జిల్లాల్లోని 35 మండలాల్లో 48 మందిపై క్రిమినల్ కేసులు**
**ధరణి పోర్టల్ అక్రమాలపై ఉన్నతస్థాయి కమిటీ నివేదిక**
**మంత్రి శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



హైదరాబాద్, (ప్రజాస్వరం):
ధరణి పోర్టల్‌లోని లొసుగులను ఆసరాగా చేసుకొని ప్రభుత్వ భూములను కొల్లగొట్టిన వారినీ రిజిస్ట్రేషన్‌ల చలానా సొమ్మును కాజేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలోని కొందరు పెద్దలు ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని ప్రభుత్వ భూములను కాజేశారని ఆరోపించారు. దీనిపై సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థతో పైలట్ కింద ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించినట్లు వెల్లడించారు. ఇందులో అనేక అవినీతి అక్రమాలు జరిగినట్లు ప్రాథమిక నివేదికలో స్పష్టమైందని ఆయన తెలిపారు. ఈ ఫోరెన్సిక్ నివేదికను పరిశీలించిన తర్వాత మిగిలిన 31 జిల్లాల్లో కూడా ఫోరెన్సిక్ ఆడిట్ ..మిగతా 4లో

## సింగరేణి రికార్డులను వెంటనే సీజ్ చేయాలి

**గతంలో సింగరేణిని కేసీఆర్ కుటుంబం దోచుకుందన్న బండి సంజయ్**
**ఇప్పుడు కాంగ్రెస్ మంత్రులు అదే పనిలో ఉన్నారని ఆరోపణ**
**రెండు పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని వ్యాఖ్య**




## ఫాంహౌస్‌లో కేసీఆర్‌తో భేటీ కానున్న కేటీఆర్, హరీశ్

**బీఆర్ఎస్‌లో ఒత్తిడి పెంచుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు**
**ఫాంహౌస్‌కు వెళ్లనున్న కేటీఆర్, హరీశ్, ముఖ్య నేతలు**



హైదరాబాద్, (ప్రజాస్వరం):
ఫోన్ ట్యాపింగ్ కేసు నేపథ్యంలో బీఆర్ఎస్‌లో రాజకీయ ఉత్కంఠ పెరుగుతోంది. ఈ పరిణామాల మధ్య మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు ఈ మధ్యాహ్నం ఎర్రవల్లి ఫాంహౌస్‌కు వెళ్లనున్నారు. అక్కడ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పార్టీకి చెందిన ముఖ్య నేతల కీలక ..మిగతా 2లో

## నాంపల్లిలో అగ్ని ప్రమాదం..

**ఫర్నీచర్ షాపులో చెలరేగిన మంటలు**
**నాలుగు అంతస్తులకు వ్యాపించిన మంటలు**
**భవనంలో ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సమాచారం**
**మంటలు ఆర్పుతున్న నాలుగు ఫైరింజన్లు**



హైదరాబాద్, (ప్రజాస్వరం):
హైదరాబాద్ నగరంలోని రద్దీ ప్రాంతమైన నాంపల్లిలో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఒక ఫర్నిచర్ షోరూమ్‌లో ఒక్కసారిగా చెలరేగిన మంటలు ..మిగతా 2లో

## స్టార్టప్ కేంద్రంగానే టీ హబ్..

టీ హబ్ ను ప్రత్యేక స్టార్టప్‌ల కేంద్రంగానే గుర్తించాలని చెప్పారు
ప్రభుత్వ ఆఫీసులను తరలిస్తున్నారన్న వార్తలపై స్పందించిన రేవంత్ రెడ్డి
అమెరికా పర్యటన నుంచే సీఎస్‌కు ఫోన్ చేసి సూచనలు




## నేను వ్యక్తిగత దూషణలు చేయను... చిల్లర భాషను వాడను

*ఫోన్ ట్యాపింగ్ కేసులో*
*బీఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్ కు సిట్ నోటీసులు*
*విమర్శలు చేసిన 12 గంటల్లోపే చర్యలంటూ ఆరోపణ*
*హెచ్చరికలకు భయపడనని,*
*ఆధారాలతో సమాధానమిస్తానని వెల్లడి*
*ఇది రేవంత్ రెడ్డి సర్కారు ప్రతీకార చర్యేనని విమర్శ*
*సజ్జనార్‌ను సిట్ చీఫ్‌గా నియమించడాన్ని*
*నైతికంగా ప్రశ్నించానని స్పష్టీకరణ*



హైదరాబాద్, (ప్రజాస్వరం):
తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఈ వ్యవహారంలో సిట్ దర్యాప్తును విమర్శిస్తూ మీడియా సమావేశం నిర్వహించిన 12 గంటల్లోపే తనకు నోటీసులు జారీ చేయడంపై బీఆర్ఎస్ ముఖ్య నేత ..మిగతా 3లో

## లీకుల టెన్షన్

*ఫోన్ ట్యాపింగ్ పై అంతా అయోమయం*
*అరెస్ట్, నోటీసులు అంటూ లీకులు*
*విచారణ కంటే అవే ప్రమాదమంటూ ఆందోళన*




## నైనీ టెండర్ రద్దు చేశారంటే.. స్కాం జరిగినట్టే కదా?

*సైట్ విజిట్ అమలు. నైనీ రద్దుతో అవినీతి తేటతెల్లం*
*బొగ్గు టెండర్లు ఎందుకు రద్దు చేశారు...?*
*మాజీ మంత్రి హరీశ్ రావు*
*అవినీతి జరగనప్పుడు భయపడ్డారెందుకూ..?*



హైదరాబాద్, (ప్రజాస్వరం):
బొగ్గు కుంభకోణం విషయంలో అవినీతి ఆరోపణలు రావడంతో నైనీ టెండర్ రద్దు చేశారంటే, స్కాం జరిగినట్లేనని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావుఆరోపించారు. శనివారం హరీష్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు. నైనీ వ్యవహారంలో మంత్రి భట్టి మసిబూసి మారేడు కాయ చేస్తున్నారని ఆరోపించారు. సింగరేణిలో సోలార్ స్కాం చేసిన ఆరోపణలపై మౌనం ..మిగతా 3లో

## షోరూం వద్దే రిజిస్ట్రేషన్స్

రాష్ట్రంలో కొత్త పాలసీ
కార్యాలయాల చుట్టూ తిరుగుడకు బ్రేక్
ప్రయోగాత్మకంగా
ఒకచోట అమలు సక్సెస్
టూవీలర్, ఫోర్ వీలర్ నూతన
వాహనాలకే కొత్త విధానం




www.prajaswaramdaily.com
WWW.PRAJASWARAMDAILY.COM

## సింగరేణి రికార్డులను వెంటనే సీజ్ చేయాలి



- **గతంలో సింగరేణిని కేసీఆర్ కుటుంబం దోచుకుందన్న బండి సంజయ్**
- **ఇప్పుడు కాంగ్రెస్ మంత్రులు అదే పనిలో ఉన్నారని ఆరోపణ**
- **రెండు పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని వ్యాఖ్య**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. రెండు పార్టీలూ కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గతంలో కేసీఆర్ కుటుంబమే సింగరేణిని దోచుకుందని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో మంత్రులు, దళారులు అదే పనిలో ఉన్నారని ఆరోపించారు. అందుకే ఒకరి అవినీతిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారని విమర్శించారు.

కాంగ్రెస్ అవినీతిపై బీఆర్ఎస్ లేఖ రాస్తే... బీఆర్ఎస్ అవినీతిపై విచారణ జరుపుదామా అని మంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానిస్తున్నారని... ఇదంతా చూస్తే రెండు పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని అర్థమవుతోందని బండి సంజయ్ అన్నారు. సింగరేణిలో 2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన గనుల కేటాయింపులు, దోపిడీపై పూర్తిస్థాయి విచారణ జరిపి శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలో దోపిడీపై ప్రశ్నిస్తే గుజరాత్‌ను ఎందుకు లాగుతున్నారని ప్రశ్నించారు.

తెలంగాణ సాధన కోసం సింగరేణి కార్మికులు పోరాటాలు చేస్తే... ఉమ్మడి రాష్ట్రంతో పోలిస్తే ఇప్పుడు మరింత ఎక్కువగా గనుల దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. ఆరోపణలు, ప్రత్యారోపణలతో కాలయాపన చేయకుండా సింగరేణికి సంబంధించిన అన్ని రికార్డులను వెంటనే సీజ్ చేయాలని కోరారు. ఆలస్యం జరిగితే అవి తారుమారు చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే సింగరేణికి చెల్లించాల్సిన రూ.42 వేల కోట్లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్ పాలనలో సింగరేణిని అప్పులపాలు చేసి, దోచుకున్న డబ్బుతోనే బీఆర్ఎస్ పార్టీని నడిపించారని బండి సంజయ్ ఆరోపించారు. ఎన్నికలకు ముందు సింగరేణిని లాభాల్లోకి తీసుకొస్తామంటూ హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఆ నిధులను మళ్లించడం పరిపాటిగా మారిందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ తోడు దొంగలేనని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక మేయర్, ఛైర్మన్ స్థానాలను గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

ఫోన్ ట్యాపింగ్ కేసుపై కూడా బండి సంజయ్ తీవ్ర విమర్శలు చేశారు. కేటీఆర్‌ను సాక్షిగా పిలిచామని మంత్రులు చెబుతుంటే, అసలు దోషులను సాక్షులుగా ఎలా పిలుస్తారని ప్రశ్నించారు. ఇలా చేస్తే ఫోన్ ట్యాపింగ్ చేసిన అసలు నిందితులను కాపాడుతున్నట్టేనని ఆరోపించారు. సిట్‌పై ప్రభుత్వ ఒత్తిడి ఉంటే దాని విశ్వసనీయత కోల్పోతుందని హెచ్చరించారు. కేటీఆర్ ఇంకా అహంకారంతో మాట్లాడుతున్నారని, ఫోన్ ట్యాపింగ్ చేయలేదని చెబుతున్న కేసీఆర్, కేటీఆర్ దేవాలయంలో కుటుంబంతో కలిసి ప్రమాణం చేసే ధైర్యం ఉందా? అని సవాల్ విసిరారు. హీరోయిన్లు, వ్యాపారులు, బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేల నంబర్లను కూడా మావోయిస్టుల జాబితాలో పెట్టి ట్యాపింగ్ చేయలేదా? అని నిలదీశారు.

## ఆయన వెనక ఎవరో ఉన్నారు

**మొదటిపేజీ తరువాయి**

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విచారణ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని తెలిపారు. దీనివల్ల అసలు దోషులు ఎవరో తేలుతుందని భట్టి స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ పరువును బజారుకీడ్చేలా జరుగుతున్న దుష్ప్రచారాలపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పక్కా ప్రణాళిక ప్రకారమే కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం సంస్థపై విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వాస్తవాలను వెల్లడించారు.


సింగరేణి టెండర్లలో 'సైట్ విజిట్' అనే నిబంధనను ఏదో కొత్తగా చేర్చినట్లు కొన్ని పత్రికలు, సోషల్ మీడియాలో కథనాలు రావడంపై భట్టి స్పష్టత ఇచ్చారు. ఈ నిబంధన వెనుక ఉన్న నిజాలను తెలిపారు. సైట్ విజిట్ నిబంధనను కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన కోల్ ఇండియా 2018లోనే తన టెండర్ పత్రాలలో పొందుపరిచింది. 2021లో సెంట్రల్ మైనింగ్ కూడా సైట్ విజిట్ తప్పనిసరి అని పేర్కొంది. ఆ సమయంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో లేదు. కేవలం సింగరేణిలోనే కాదు.. గుజరాత్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, రైల్వేస్‌కు చెందిన 'రైట్స్', హిందుస్థాన్ కాపర్స్ వంటి కేంద్ర సంస్థల టెండర్లలోనూ ఈ నిబంధన అమల్లో ఉంది.సింగరేణి అనేది తెలంగాణకు గుండెకాయ వంటిదని.. సుమారు 42 వేల మంది శాశ్వత ఉద్యోగులు, 30 వేల మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది జీవనోపాధి దీనిపై ఆధారపడి ఉందని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. అక్రమ రాతల వల్ల కార్మికుల మనోస్థైర్యం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి ఒక స్వయంప్రతిపత్తి సంస్థ అని.. ఇక్కడ జరిగే ప్రతి నిర్ణయం మంత్రిమండలి వద్దకు రాదని ఆయన స్పష్టం చేశారు. అయినప్పటికీ.. ప్రజల్లో అపోహలు కలగకూడదనే ఉద్దేశంతో నైనీ కోల్ బ్లాక్ టెండర్లను వెంటనే రద్దు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

**విచారణను స్వాగతిస్తున్నాం..**

ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ నాయకుడు హరీశ్ రావు లేఖ రాయడం, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విచారణకు ఆదేశించడాన్ని తాము స్వాగతిస్తున్నామని భట్టి పేర్కొన్నారు. విచారణ జరిగితేనే అసలు నిజాలు బయటకు వస్తాయని.. ఎవరు ఎవరి ప్రయోజనాల కోసం ఇలాంటి కథనాలు వండివారుస్తున్నారో ప్రజలకు తెలుస్తుందని అన్నారు. సింగరేణి ఆస్తులను రాబందుల నుండి కాపాడే బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందన్నారు. రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వానికి, రాష్ట్రానికి నష్టం చేసేలా ప్రవర్తించడం సరికాదని విపక్షాలకు హితవు పలికారు.



# లీకుల టెన్షన్



- **ఫోన్ ట్యాపింగ్ పై అంతా అయోమయం**
- **అరెస్ట్, నోటీసులు అంటూ లీకులు**
- **విచారణ కంటే అవే ప్రమాదమంటూ ఆందోళన**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలను కుదిపేస్తోన్న ఫోన్ ట్యాపింగ్ కేసు ఇప్పుడు అత్యంత కీలక దశకు చేరుకుంది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ నేతృత్వంలో ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణను వేగవంతం చేయడంతో, ఈ వ్యవహారం మాజీ మంత్రుల నుంచి పార్టీ అధినేత వరకు పాకే అవకాశం కనిపిస్తోంది. కేసీఆర్‌కూ నోటీసులు వస్తాయని బీఆర్ఎస్ నేతలు కూడా గట్టిగా భావిస్తున్నారు. అయితే, విచారణలు, నోటీసుల సంగతి ఎలా ఉన్నా.. లీకులతోనే తమకు ప్రమాదంగా మారిందంటూ ఇటు బీఆర్ఎస్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. తాజాగా ఇదే విషయాన్ని కేటీఆర్ కూడా ప్రస్తావించారు. ప్రారంభంలో సాధారణ పోలీసు విచారణగా మొదలైన ఈ కేసు, ఉన్నత స్థాయి వ్యక్తుల ప్రమేయం ఉందన్న అనుమానాలతో సజ్జనార్ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందానికి బదిలీ అయింది. సున్నితమైన కేసులను ఛేదించడంలో, క్లిష్టమైన విచారణలను జరపడంలో సజ్జనార్‌కు ఉన్న ట్రాక్ రికార్డును పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా విచారణ సాగాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. ఉన్నత స్థాయి నాయకులను ప్రశ్నించే సమయంలో ఎదురయ్యే న్యాయపరమైన, పరిపాలనాపరమైన సవాళ్లను ఎదుర్కోవడానికి సిట్ పటిష్టమైన వ్యూహంతో ముందుకు వెళ్తోంది.

**హరీష్, కేటీఆర్ విచారణ**

ఇప్పటికే మాజీ మంత్రులు హరీష్ రావు, కేటీఆర్‌లను సిట్ అధికారులు గంటల తరబడి ప్రశ్నించడం రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ విచారణలు కేవలం ప్రారంభం మాత్రమేనని, త్వరలోనే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు కూడా నోటీసులు వెళ్తాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. కేటీఆర్ సైతం తన విచారణ అనంతరం మాట్లాడుతూ, ఈ నోటీసుల పరంపర చివరకు కేసీఆర్ వద్దకే చేరుతుందనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటెలిజెన్స్ విభాగాన్ని రాజకీయ అవసరాల కోసం వాడుకున్నారనే ప్రధాన ఆరోపణను నిరూపించే దిశగా సిట్ అడుగులు వేస్తోంది.

**లీకులు , వ్యక్తిత్వ హననంపై ఆందోళన**

కేసులు, విచారణల కంటే, దర్యాప్తు సంస్థల నుంచి అందుతున్న లీకుల పట్ల బీఆర్ఎస్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. విచారణ గదిలో ఏం జరుగుతుందో తెలియకముందే, కొన్ని మీడియా సంస్థల్లో తమకు వ్యతిరేకంగా కథనాలు రావడం వెనుక ప్రభుత్వ ప్రమేయం ఉందని వారు ఆరోపిస్తున్నారు. హీరోయిన్ల ఫోన్ ట్యాపింగ్ వంటి సున్నితమైన అంశాలను లీకుల ద్వారా ప్రచారం చేయడం కేవలం తమ వ్యక్తిత్వ హననానికి ఉద్దేశించినదేనని కేటీఆర్ మండిపడ్డారు. ప్రతి ప్రభుత్వంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఉంటుందని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం దానిని అక్రమ ట్యాపింగ్‌గా చిత్రించి విచారణ పేరుతో కాలయాపన చేస్తోందని బీఆర్ఎస్ నేతల వాదన. ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ అనే అంశాన్ని ఒక పొలిటికల్ నేరేటివ్‌గా మార్చి, తమ పార్టీని మానసికంగా దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని వారు విశ్లేషిస్తున్నారు.

**కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే ఉద్యమం**

తమకు నోటీసులు ఇస్తే సహకరించాం కానీ కేసీఆర్ ను విచారణ పేరుతో వేధిస్తే ఊరుకునేది లేదని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. రాజకీయంగా ఈ అంశాన్ని పెద్ద ఇష్యూగా మార్చాలని ప్లాన్ చేసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. అంటే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చిన తర్వాత తెలంగాణ రాజకీయాలు మరింత ఉత్కంఠగా మారనున్నాయి.

### ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం
## అత్యంత దుర్మార్గం

**మొదటిపేజీ తరువాయి**

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో ప్రభుత్వాలను చూశానని, కానీ ఫోన్ ట్యాపింగ్ వంటి నీచమైన రాజకీయాలను కేవలం కేసీఆర్ హయాంలోనే చూశాం అని మంత్రి జూపల్లి విమర్శించారు. 2021 నుండి తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు వెల్లువెత్తాయని, మాజీ గవర్నర్ తమిళిసై, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి, ఈటల రాజేందర్, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ వంటి వారిపై నిఘా పెట్టారనే అనుమానాలను వారు గతంలో వ్యక్తం చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని ఆయన అన్నారు. పోలీసు, ఇంటెలిజెన్స్ వంటి వ్యవస్థలను సొంత పార్టీ నేతలను, ప్రతిపక్ష పార్టీ నేతలను, వ్యాపారవేత్తలను బ్లాక్ మెయిల్ చేయడానికి వాడుకోవడం బీఆర్ఎస్ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో అర్ధరాత్రి తలుపులు బద్దలు కొట్టి, ప్రొఫెసర్ కోదండరాం వంటి వారిని అక్రమంగా అరెస్ట్ చేసినప్పుడు మీ రాజకీయ విలువలు ఏమయ్యాయని మంత్రి నిలదీశారు. మేము అధికారంలోకి వచ్చాక కక్ష సాధింపులకు దిగలేదు. ఒకవేళ అదే మా ఉద్దేశమైతే ఎప్పుడో జైలుకు పంపేవాళ్లం. కానీ మేము చట్టాన్ని గౌరవిస్తున్నాం. కేవలం సాక్షిగా సమాచారం అడిగే సీఆర్పీసీ 160 నోటీసు ఇస్తేనే ఇంతలా భయపడిపోవాలా? అని ఆయన ప్రశ్నించారు. సాక్షిగా సిట్ విచారణకు పిలిస్తే, కేటీఆర్ ఎందుకు అంతలా ఆందోళన చెందుతున్నారని మంత్రి ప్రశ్నించారు. గతంలో ఏ విచారణకైనా సిద్ధం అని ప్రగల్భాలు పలికిన కేటీఆర్, ఇప్పుడు నోటీసులు రాగానే డ్రామాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో సంబంధం లేకపోతే, నిర్దోషులైతే భయపడాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం అత్యంత దుర్మార్గమని, ఇతరుల వ్యక్తిగత జీవితాల్లో తొంగిచూడటం ఏ సంస్కృతిని సూచిస్తుందో బీఆర్ఎస్ నేతలు ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. ఈ వ్యవహారంలో సూత్రధారులు, పాత్రధారులు ఎవరో సిట్ దర్యాప్తులో తేలాల్సి ఉందని, నిజాలు బయటకు రావడం ఖాయమని చెప్పారు. రాజకీయ నాయకులు చట్టానికి అతీతులు కాదని, తప్పు చేసిన వారు ఏ పార్టీ వారైనా శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు. ఈ విచారణలో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన వారిని కూడా సాక్షులుగా పిలుస్తున్నారని, కేవలం బీఆర్ఎస్ నేతలనే టార్గెట్ చేస్తున్నట్లు మాట్లాడటం సరికాదన్నారు.చట్టబద్ధ సంస్థలపై బురద జల్లే ప్రయత్నాలను ప్రభుత్వం సహించదని హెచ్చరించారు. అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు చేసిన వారు ఏ పార్టీ వారైనా సరే శిక్ష అనుభవించాల్సిందేనని తేల్చి చెప్పారు.మిగులు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి, అవినీతి, కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని ఛిన్నభిన్నం చేసిన బీఆర్ఎస్ నేతలను ప్రజలు ఎప్పుడో విస్మరించారని మంత్రి అన్నారు. ఇప్పటికైనా కేటీఆర్, హరీష్‌రావు తమపై పడ్డ బట్ట కాల్చి ఇతరుల మీద వేసే పనులు మానుకోవాలని హితవు పలికారు.

### నేను వ్యక్తిగత దూషణలు చేయను...
## చిల్లర భాషను వాడను

**మొదటిపేజీ తరువాయి**



ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది కచ్చితంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రతీకార చర్యేనని ఆరోపించారు. ప్రభుత్వ హెచ్చరికలకు, నోటీసులకు భయపడేది లేదని, తన వద్ద ఉన్న ఆధారాలతోనే సిట్‌కు సమాధానం ఇస్తానని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో తమ పార్టీ సీనియర్ నేతలు కేటీఆర్, హరీశ్ రావులకు సంబంధం లేకున్నా సిట్ వేధిస్తోందని శుక్రవారం మీడియా సమావేశంలో విమర్శించినట్లు ఆయన గుర్తుచేశారు. ఆ ప్రెస్ మీట్ ముగిసిన 12 గంటల్లోపే, శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు సిట్ పోలీసులు తన ఇంటికి వచ్చి నోటీసులు ఇచ్చారని ప్రవీణ్ కుమార్ తెలిపారు. రెండు రోజుల్లో ఆధారాలతో సమాధానం ఇవ్వాలని, లేకపోతే సివిల్, క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై గొంతెత్తడం ప్రతిపక్ష నేతగా తన హక్కు అని, ఇలాంటి వార్నింగులకు భయపడనని తేల్చిచెప్పారు.

సిట్ చీఫ్ సజ్జనార్‌పై తాను వ్యక్తిగత ఆరోపణలు చేయలేదని, ఆయనపై ఏపీలో నమోదైన కేసులపై సిట్ వేయాలని డిమాండ్ చేసినట్లు నోటీసులో పేర్కొనడం వాస్తవ విరుద్ధమని అన్నారు. "నేను వ్యక్తిగత దూషణలు చేయను... చిల్లర భాషను వాడను. 2015లో ఓటుకు నోటు కేసు సమయంలో నాటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి కెమెరాకు అడ్డంగా దొరికారు. ఆ తర్వాత ఏపీ నేతల ఫోన్లు ట్యాప్ చేశారని తెలంగాణ ఇంటెలిజెన్స్ అధికారులపై కేసులు నమోదయ్యాయి. ఆ సమయంలో సజ్జనార్ కూడా ఇంటెలిజెన్స్ విభాగంలో అధికారిగా పనిచేశారు. అందుకే, ఇప్పుడు ఆయనే ఈ ట్యాపింగ్ కేసు దర్యాప్తుకు నేతృత్వం వహించడం నైతికంగా సరైంది కాదని మాత్రమే నా అభిప్రాయం చెప్పాను. ఇది రాజ్యాంగం కల్పించిన హక్కు" అని తన వ్యాఖ్యలను ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సమర్థించుకున్నారు. ప్రభుత్వం తమపై కక్ష సాధిస్తోందని, బీఆర్ఎస్ నేతలపై వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న బొగ్గు కుంభకోణం వంటివాటిపై సిట్ ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. కేవలం ప్రభాకర్ రావు, ఆయన కుటుంబ సభ్యులు, కింది స్థాయి సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని దర్యాప్తు చేయడం అన్యాయమని అన్నారు. బీఆర్ఎస్ నేతలకు మాత్రమే ఆగమేఘాల మీద నోటీసులు రావడం, దర్యాప్తు వివరాలు మీడియాకు లీక్ కావడం, కాంగ్రెస్ నేతలు గాంధీభవన్‌లో లైవ్ కామెంటరీలు ఇవ్వడం చూస్తుంటే ఇదంతా రాజకీయ కుట్ర అని స్పష్టమవుతోందని ప్రవీణ్ కుమార్ విమర్శించారు. ప్రభుత్వ అణచివేతకు వ్యతిరేకంగా తమ పోరాటం ఆగదని ఆయన హెచ్చరించారు.

## నైనీ టెండర్ రద్దు చేశారంటే.. స్కాం జరిగినట్టే కదా?

**మొదటిపేజీ తరువాయి**

ఎందుకు వహిస్తున్నారని ఆరోపించారు.

రేవంత్ రెడ్డి బావమరిది కోసమే ఈ తతంగమంతానని విమర్శించారు. బొగ్గు కుంభకోణంలో అవినీతి జరగలేదని సూటిగా చెప్పలేక, విషయాలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. నైనీ టెండర్ రద్దు చేయడమే అవినీతికి నిదర్శనమని, అదే తరహాలో పిలిచిన మిగిలిన టెండర్లను ఎందుకు రద్దు చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

బొగ్గు కుంభకోణంలో అవినీతి జరగలేదని చెప్పకుండా బీటింగ్ అరౌండ్ ద బుష్‌లా ఏదో చెప్పి, మసిబూసి మారేడు కాయ చేసారు. మీరెన్ని సాకులు చెప్పినా మీ కాంగ్రెస్ పాలనలో బొగ్గు కుంభకోణం జరిగింది నిజం. అందులో రేవంత్ రెడ్డి బామ్మర్ది రింగ్ మెన్ గా పాత్ర పోషించింది నిజం. నేను సూటిగా అడుగుతున్నా. ఏ స్కాం జరగకుంటే నైనీ టెండర్లను రద్దు చేస్తున్నట్లు ఎందుకు ప్రకటించారు?

శనివారం బయటపెట్టిన మరో కుంభకోణం.. సోలార్ పవర్ స్కాం గురించి ఎందుకు ఒక్క మాట కూడా ప్రెస్ మీట్ లో మాట్లాడలేదని నిలదీశారు. నైనీని రద్దు చేసినట్లే మిగతా అన్ని టెండర్లను ఎందుకు రద్దు చేయడం లేదు? సైట్ విజిట్ సర్టిఫికేట్ నిబంధనను బిఆర్ఎస్ మీద నెట్టే ప్రయత్నం చేయడం వల్ల నిజాలు అబద్ధాలు అయిపోవు. జరిగిన స్కాంలు, స్కీంలుగా మారిపోవని స్పష్టం చేశారు.

**రేవంత్‌రెడ్డి, బావమరిది కుంభకోణంపై విచారణకు హామీ ఇస్తే లేఖ రాస్తా**

సైట్ విజిట్ నిబంధనను 2018లోనే మొదలైందని చెప్పి, దానికి కేంద్ర ప్రభుత్వ సంస్థలను ఉదాహరణలుగా చెప్పి ఏం చెప్పదలుచుకున్నారు? అది తప్పు కాకుంటే నైనీ ఎందుకు రద్దు చేసినట్లు? ఇదే సైట్ విజిట్ విధానం సింగరేణిలో కూడా అమలు చేసామని ఇప్పటికైనా ఒప్పుకున్నందుకు ధన్యవాదాలని అన్నారు.

భట్టి గారూ. మీరంటే నాకు చాలా గౌరవం. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తిపై విచారణ జరగాలంటే సిట్టింగ్ జడ్జీ లేదా కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సీబీఐ మాత్రమే చేయగలవు అన్న ఉద్దేశ్యంతోనే లేఖ రాసాను. మీరు నిజంగా రేవంత్ రెడ్డి, అతని బావమరిది కుంభకోణం మీద నిష్పక్షపాతంగా విచారణ జరిపిస్తాను అని హామీ ఇస్తే మీకూ లేఖ రాయడానికి సిద్ధమని హరీష్‌రావు స్పష్టం చేశారు.



# అందరి బాగోతాలను బయటపెడతాం

**మొదటిపేజీ తరువాయి**

నిర్వహిస్తామని ప్రకటించారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడిన సంఘటనలపై ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీతో శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి సమావేశం నిర్వహించారు. విచారణలో ఎదురైన అంశాలు,ఎవరి పాత్ర ఎంత? తెరవెనుక ఎవరైనా ఉన్నారా? రెవెన్యూ అధికారుల పాత్ర ఏమైనా ఉందా? వంటి అంశాలపై కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కమిటీ ప్రాథమిక నివేదికను పరిశీలించి మరికొన్ని సలహాలు సూచనలు చేస్తూ మరింత లోతైన విచారణ జరిపి తుది నివేదికను సమర్పించాలని సూచించారు.

**ప్రాథమిక విచారణలోనే రూ. 4 కోట్ల అవినీతి**

ధరణి పోర్టల్ ప్రారంభమైనప్పటి నుంచి 35వేల లావాదేవీలు జరిగాయని ఇందులో ప్రాథమికంగా 4,848 లావాదేవీల్లో లోటుపాట్లు జరిగినట్లు కమిటీ గుర్తించిందని మంత్రి తెలిపారు. విచారణ తర్వాత 1109 డాక్యుమెంట్లకు సంబంధించి రూ. 4 కోట్లుప్రభుత్వానికి చెల్లింపు జరగలేదని కమిటీ సభ్యులు వివరించారని తెలిపారు. గత ప్రభుత్వం ముందుచూపు లేకుండా అనాలోచితంగా, కుట్రపూరితంగా తీసుకువచ్చిన ధరణి పోర్టల్ లోని లొసుగులను ఆసరాగా చేసుకొని కొంతమంది అక్రమాలకు పాల్పడ్డారన్నారు. వీటిపై ఆరోపణలు రావడంతో భూభారతి పోర్టల్ ద్వారా ఆడిట్ నిర్వహించి అక్రమాలను గుర్తించి తక్షణమే ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేపట్టామని తెలిపారు. ఇందుకు సంబంధించి తొమ్మిది జిల్లాల్లోని 35 మండలాల్లో అక్రమాలకు పాల్పడిన 48 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే ప్రతిపక్షంలో ఉన్న ఓ నాయకుడు రూ. వెయ్యి కోట్ల అవినీతి అని, మరో నాయకుడు రూ. పదివేల కోట్లు అని ఇంకొక్కరు భూభారతి పోర్టల్ అవినీతిమయమని నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు.

**నేడు సర్వేయర్లకు లైసెన్సులు**

ఇప్పటికే మొదటి విడతలో నాలుగు వేల మంది శిక్షణ పొందిన సర్వేయర్లకు లైసెన్సులు జారీ చేయగా నేడు ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో మరో రెండు వేల మందికి లైసెన్సులు జారీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ లైసెన్స్‌డ్ సర్వేయర్లతో రాష్ట్రంలో నక్షా లేని 373 గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, ఇంటిలిజెన్స్ అదనపు డిజి విజయ్‌కుమార్ ,ఉన్నతస్థాయి కమిటీ సభ్యులు డీఐజీ ఎమ్. సుభాషిని, సీఎమ్ఆర్‌వో మకరంద్, ఎసీబీ ఎస్పీ సింధు శర్మ, సైబర్ క్రైమ్ డిఎస్పీ ఎ. సంపత్, ఎన్ఐసి ప్రతినిధి శ్రీనివాస్ , హోంశాఖ సలహాదారు పి. శరత్ కుమార్ పాల్గొన్నారు.





# పీహెచ్సీలో కలెక్టర్ తనిఖీలు

**మెదక్ జనవరి 24 (ప్రజా స్వరం) :**

నర్సాపూర్ మండలం రెడ్డి పల్లె గ్రామంలో ఉన్న పిహెచ్సి ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్ సీ లోని రక్త పరీక్షల గది, మందులు అందజేసే గది, ఇన్ పేషెంట్ వార్డ్, బెడ్స్, టాయిలెట్స్, వాక్సినేషన్ ను పరిశీలించారు. ప్రతి రోజూ హాస్పిటల్ కు ఎంత మంది రోగులు వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ నెలలో ఎన్ని డెలివరీల లక్ష్యం ఉందని, ఇప్పటిదాకా ఎన్ని చేశారనీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ హాస్పిటల్ కు వచ్చే రోగులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# కబ్జాల నుంచి పార్కు స్థలం రక్షణ



**బొల్లారం, జనవరి 24(ప్రజా స్వరం) :**

బొల్లారం గ్రేటర్ పరిధిలో పారిశ్రామిక ఏరియాకు కేటాయించిన పార్కు స్థలాలను కాపాడాల్సిన బాధ్యత స్థానిక గ్రేటర్ అధికారులదే అని కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుండ్ల మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. సర్వే నెంబర్ 84లో పార్కు స్థలంలో అక్రమంగా రోడ్డును నిర్మించారన్న ఫిర్యాదులపై టౌన్ ప్లానింగ్ సిబ్బంది పరిశీలించారు. డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు అక్రమ రోడ్డును జెసిబితో ట్రెంచ్ చేసి తొలగించారు. ఖాళీగా ఉన్న పార్కు స్థలాలు కబ్జాకు గురవకుండా పకడ్బందీ చర్యలతో రక్షించి భావి తరాలకు ఉపయోగపడేలా సంరక్షించాలని మహేందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది దినేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

# ఇటిక్యాలలో ఉచిత పశు వైద్య శిబిరం




**జగదేవపూర్ : జనవరి24, (ప్రజాస్వరం) :**

జగదేవ్ పూర్ మండల పరిధిలోని ఇటిక్యాల గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ శ్వేత ఉచిత పశు వైద్య శిబిరం ఏర్పాటు చేసారు. కార్యక్రమంలో పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు, గర్భనిర్ధారణ పరీక్షలు, ఎద సూదులు, దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ దీన రాజలింగం హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం పశువులకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, గోపాల మిత్రలు కనుకయ్య,గౌరయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే బాలికల బంగారు భవిష్యత్

- బాలికల, మహిళా రక్షణ కోసం షీ టీమ్
- నేటి సమాజంలో బాలికలు అన్ని రంగాల్లో ప్రతిభ
- అదనపు ఎస్పీ మహేందర్
- ఘనంగా జాతీయ బాలికల దినోత్సవ వేడుకలు



**మెదక్ జనవరి 24 (ప్రజా స్వరం) :**

జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్ రెసిడెన్షియల్ స్కూల్ & కాలేజీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడిన అదనపు ఎస్పీ నేటి సమాజంలో బాలికలు అన్ని రంగాల్లో ప్రతిభను చాటుతూ ముందంజలో ఉన్నారని తెలిపారు. ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే ప్రతిభతో పాటు ఆత్మవిశ్వాసం, నిరంతర కృషి, పట్టుదల ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్య అనేది బాలికలకు అత్యంత శక్తివంతమైన ఆయుదమని, అది భవిష్యత్తును మార్చే శక్తిని ఇస్తుందని అన్నారు. బాలికల రక్షణ, భద్రత అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పించిన ఆయన, అన్యాయం జరిగినప్పుడు మౌనంగా ఉండకూడదని, ధైర్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో షీ టీమ్స్ నిరంతరం నిఘా ఉంచుతూ మహిళలు, బాలికల భద్రత కోసం పనిచేస్తున్నాయని, అవసరమైన సందర్భాల్లో వెంటనే 100 డయల్ చేయాలని సూచించారు. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని, అపరిచితులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని సూచించారు. ఈ సందర్భంగా 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినుల తల్లిదండ్రులను సత్కరించి, నాటకాలు, క్విజ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. చివరగా బాలికల రక్షణ, విద్య, అభివృద్ధి కోసం ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ విజయ, డీడబ్ల్యూఓ హేమ భార్గవి, ప్రిన్సిపాల్ తార సింగ్, భరోసా కోఆర్డినేటర్ సౌమ్య, లీగల్ అడ్వైజర్ అడ్వకేట్ శ్వేత, సీడీపీఓ వెంకట రమణమ్మ, ఐసీపీయస్ కోఆర్డినేటర్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే ఆదుకోవాలి

**జవహర్ నగర్, జనవరి 24,(ప్రజాస్వరం):**




పెంచికల్ పహాడ్ గ్రామంలో లైంగిక దాడికి గురైన నాలుగేళ్ళ చిన్నారి భాదిత కుటుంబాన్ని భువనగిరి ఎమ్మెల్యే కుంబం అనిల్ కుమార్ రెడ్డి వెంటనే అన్ని విధాల ఆదుకోవాలని ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యూ (విముక్తి)) తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ పెర్క సునీత డిమాండ్ చేశారు. శనివారం జిహెచ్ఎంసి జవహర్ నగర్ లో అయినపు పద్మ జాతీయ బాలిక దినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ... తన నియోకవర్గంలో ఒక పసిపిల్లపై జరిగిన అత్యాచారం, తీవ్ర హింస వలన ప్రాణాపాయ స్థితి నుండి భయటపడి 12 రోజులు కావస్తున్నా, కనీసం భువనగిరి స్థానిక ఎమ్మెల్యే ఇలాంటి అమానవీయమైన ఘటనపై స్పందించి, సంభందిత బాధిత కుటుంబాన్ని పరామర్శించకపోవడాన్ని బహుజన సత్త రాష్ట్ర అధ్యక్షుడు బండకింది సింగరయ్య గౌడ్ తీవ్రంగా తప్పు పట్టారు. ఇప్పటికైన అనిల్ కుమార్ రెడ్డి ఒక నియోజకవర్గ ప్రజా ప్రతినిధిగా తన సామాజిక బాధ్యత ను గుర్తించి, తగిన మానసిక ధైర్యాన్ని అందివ్వకపోతే ఇంతకంటే దుర్మార్గం మరొకటి లేదని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ పేర్క సునీత అన్నారు. అత్యాచారాలు, లైంగిక హింసల పట్ల సమాజం తీవ్రమైన నేరంగా బావించకపోవడం వలనే బాలికలపై లైంగిక నేరాల దాడులు తీవ్రమయ్యాయని తెలంగాణ ఉద్యమ కళాకారుల వేదిక(టియుకెవి) రాష్ట్ర కమిటీ సభ్యురాలు తుమ్మరాణి ఆవేదన చెందారు. ఎన్ని రక్షణ చట్టాలు ఉన్న భద్రతను కల్పించడంలో ప్రభుత్వ అదికారులు, పోలీసులు, తల్లిదండ్రులు పిల్లల సంరక్షణకు ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగులలో సరైన అవగాహన కల్పించకపోవడంతోపాటు సమాజంలో ఆడపిల్లల పట్ల నెలకొన్న వివక్షత, నిర్లక్ష్యంతో కూడిన చిన్నచూపు అభద్రతకు గురౌతున్నారని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ(టియుజేఏసి) రాష్ట్ర కమిటీ సభ్యురాలు సన్వాల సుచరిత పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా నేటి ఆధునిక సమాజంలో చిన్నారి నుంచి వృద్దుల వరకు ఎవరికి భద్రత లేకుండా పోయిందని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఇఫ్టూ) కన్వీనర్ షేక్ షావలి ఆందోళనను వ్యక్తం చేశారు. నిత్యం వార్త పత్రికలు, ఎలక్ట్రానిక్, శోషల్ మీడియాల్లో మానవత్వాన్ని మంటగలిపేలా ఆడబిడ్డలపై జరుగుతున్న అనేక దారుణ సంఘటనలు తీవ్ర మనోవేదనకు గురిచేశాయని అన్నారు. మద్యం, గంజాయి లాంటి మత్తు పదార్థాలు లైంగిక హింసకు పరాకాష్టగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం భవిషత్ తరాలకు, పిల్లల సర్వోన్నత అభివృద్ధికి ఉపయోగ పడాలికానీ, అందుకు విరుద్ధంగా లింగ వివక్షత, లైంగిక, గ్రుహహింస పెరగడానికి కారణం అవుతున్నాయని గుర్తుచేశారు. పాలకులు గత 18 సంవత్సరాలుగా జాతీయ బాలికా దినోత్సవం పేరిట ఎన్నో పథకాలు చేపట్టారని, అందులో బేటి బచావో, బేటి పడావో మాటున తిరిగి నాలువేల సంవత్సరాల వెనుకటి బానిస సమాజంలోకి స్త్రీలను, పిల్లలను నెట్టివేసే మనువాద పాలనలో పోషక ఆహార లోపం, రక్తహీనత లాంటి రుగ్మతలతో జీవించే హక్కును కూడ కోల్పుతున్నారని అన్నారు. ఇప్పటికైన సభ్య సమాజంలో మనిషిని మనిషిగా ఆడపిల్లను గౌరవంగా చూసే వ్యవస్థ నిర్మాణానికి ప్రతి ఒక్కరు తమ సామాజిక బాధ్యతలో బాగంగా పాటుపడాలని షేక్ షావలి ఈ సందర్భంగా సూచించారు కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణ చారి, బీసి నేత డి.నర్సన్న, మైసయ్య, యమునా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ నేతల ఇంటింటి ప్రచారం

**తూప్రాన్, జనవరి 24 (ప్రజా స్వరం) :**

తూప్రాన్ మున్సిపాలిటీ 16వ వార్డులో తెరాస యువత, స్థానిక నాయకులు మరియు యువకులు కలిసి ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ బాకీ కార్డులు ఇంటింటికి పంచుతూ కాంగ్రెస్ అబద్దపు హామీలపై ఓటర్లకు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేయాలని ఇంటింటి కి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా వార్డు పరిధిలోని పలు కాలనీల్లో ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకొని రాజకీయ హామీలు, అభివృద్ధి అంశాలు మరియు స్థానిక సమస్యలపై చర్చించారు. స్థానిక ప్రజలతో మమేకమై వార్డు అభివృద్ధి, మౌలిక వసతులు, యువత అవకాశాలు వంటి అంశాలపై చర్చించారని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జి రమేష్, వార్డు అధ్యక్షులు బందెల నరేష్, మామిండ్ల అనిల్, గణేష్ రెడ్డి, మున్సిపల్ యువజన అధ్యక్షులు శ్రీకాంత్ చారి, వెంకటాచారి, అరవింద్, ప్రణయ్, అరుణ్, నరేందర్, సాయి తదితర నాయకులు మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ జెండా
# ఎగరడం ఖాయం



- 24వ వార్డు అభ్యర్థిగా సతీష్ దరఖాస్తు

**మెదక్ జనవరి 24 (ప్రజా స్వరం)**

భారతీయ జనతా పార్టీ మెదక్ పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధామల్లేష్ గౌడ్ అధ్యక్షతన మెదక్ జిల్లా బిజెపి కార్యాలయంలో మెదక్ మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంగమేశ్వర్ రావడం జరిగింది. జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల మేనేజ్మెంట్ టీం, వార్డు కు ఒక 9 మందితో కమిటీ లతో వార్డు అభ్యర్థులు ప్రచారం చేయాలని తప్పకుండా మెదక్ మున్సిపల్ కైవసం చేసుకోవాలని ఎంపీ రఘునందన్ రావు చేతుల మీదుగా బీ ఫోరం అందజేస్తామని అన్నారు. కార్యకర్తలు అందరూ కూడా కలిసికట్టుగా పని చేసి బిజెపి జెండా ఎగరవేయాలని అన్నారు. మెదక్ మున్సిపల్ ఎన్నికలలో 24 వార్డు బిజెపి అభ్యర్థిగా యువ మోర్చా జిల్లా అధ్యక్షులు సతీష్ దరఖాస్తు చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, కో కన్వీనర్ ఆకుల ప్రభాకర్, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు సతీష్, జిల్లా కార్యదర్శి కల్కి నాగరాజు, మాజీ జడ్పీటీసీ పంజా విజయ్, మండల అధ్యక్షులు, సర్పంచ్ బెండె వీణ, సర్పంచ్ లింగ గౌడ్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ సంగీత, మాజీ కిసాన్ మోర్చా అధ్యక్షులు మల్లారెడ్డి, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# ఓటరుడా మేలుకో... ఓటు విలువ తెలుసుకో



**కరీంనగర్, (ప్రజా స్వరం) :**

బ్యాలెట్ బుల్లెట్ కంటే బలమైంది అబ్రహం లింకన్ భారత దేశం బ్రిటిష్ పాలన నుండి విముక్తి పొందిన తర్వాత జాతీయ నాయకులు దేశ పరిస్థితులను దృష్టిలో వుంచకొని ప్రజాస్వామ్య వ్యవస్థను ఎంపిక చేశారు. .ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు పునాది.ఎన్నికల సంఘాన్ని జనవరి 25 న మొదటి గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్థాపించారు.ఎన్నికల కమిషన్ ఏర్పడి 76 సం"రాలైన సందర్భంగా ఎన్నికల కమిషన్ 2026 జనవరి 25న దేశంలో 15వ జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహిస్తుంది. దీని ఉద్దేశం ఓటర్లు తమ హక్కులు బాధ్యత లు 'ఓటు హక్కు' ఓటు విలువ 'ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన చైతన్యంకలిగిస్తారు. ఓటర్లతో సదస్సులు కళాశాల విద్యార్థులు యువజనసంఘాల చేత ర్యాలీలు వక్తృత్వ పోటీలు సెమినార్లు సాంస్కృతిక కార్యక్రమా లు నిర్వహిస్తారు. దేశంలో ఇప్పటి వరకు 17 లోకసభ ఎన్నికలు రాష్ట్రపతి ఉపరాష్ట్రప తి కార్యాలయానికి ఒక్కొక్క దానికి 16 ఎన్ని కలు 399 శాసన సభ ఎన్నికలను ఎన్నికల కమిషన్ నిర్వహించింది. .

**జాతీయ ఓటర్ల దినోత్సవం 2026 థీమ్**

బలమైన ప్రజాస్వామ్యం కోసం ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితాల సవరణ(సర్) అనే నినాదంతో అన్ని రాష్ట్రాలలో ఓటర్ల పక్షాళన మొదలుపెట్టి ఎన్నికల కమిషన్ తన పని చేసుకుంటూ వెళుతుంది. యువకులు స్వ చ్ఛందంగా మరియు బాధ్యతాయుతంగా ఓటు వేయాలి "అనే నినాదంతో ఈ ఏడాది 15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఎన్నికల కమిషన్ నిర్వహిస్తుంది.

**వయోజన ఓటు హక్కు కల్పించబడింది**

భారత్ రాజ్యాంగం 326 ప్రకారం 18 సం"రాలు నిండిన జాతీయ పౌరులకు వయోజన ఓటుహక్కు కల్పించబడింది. కుల 'మత ' లింగ ప్రాంత 'ధనిక' పేద వివక్ష లేకుండా అక్షరాస్యులకు నిరక్షరాస్యులకు సార్వత్రిక వయోజన ఓటు హక్కు కలిపించి ప్రపంచ రాజకియ చరిత్రలో గొప్ప విప్లవా త్మకమైన

**మార్పుకు శ్రీకారం చుట్టింది.**

అభివృధి చెందిన దేశాల కంటె ముందే మన దేశంలో వయోజన ఓటింగ్ హక్కు కల్పించి ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది వేసింది. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూల స్తంభం అన్న బరాక్ ఒబామా వ్యాఖ్య ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రజాస్వామిక వాదుల ఆమోదం పొందింది.

**ఓటు హక్కు వజ్రాయుధం**

ఓటు హక్కు అందరికీ వజ్రా యుధం అయింది. సామాన్యుని గొంతుకైంది .ఓటు హక్కు ద్వారా ఓటరు స్వేచ్ఛగా ఓటు వేసే హక్కు కలిగి ఉన్నాడు. తమకు నచ్చిన ప్రజాప్రతిని ధులను ఎన్నుకునే అధికారం వుంటుంది. ప్రజాస్వామ్యంలో ప్రజల చేతిలో సార్వ బౌమాధికారం అధికారం వుంటుంది.ఓటు హక్కు ద్వారా 5 ఏళ్ళకు ఒక సారి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తమ సార్వ భౌమాధి కారాన్ని వినియోగిస్తారు. ప్రజలే ప్రభువు లు అమెరికా మాజీ అధ్యక్షులు "అబ్రహం లింకన్" అభిప్రాయం ప్రకారం " ప్రజలచేత ప్రజల కొరకు నిర్వహించబడే ప్రజల ప్రభు త్వం" ప్రజాస్వామ్యం అని నిర్వచించారు ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు. ప్రజా స్వామ్య మనుగడకు ఓటే పునాది. ,ఎన్నికల కమిషన్ ఎన్నికల కమిషన్ స్వతంత్ర ప్రతి పత్తి తో పనిచేస్తూ ఓటరు నమోదు ఓటరు జాబితా తయారు 'దేశంలో చట్టసభల స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తుంది. ఎన్నికల్లో ఓటర్లు అందరు విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలి.

**ఓటు హక్కు నిర్లక్ష్యం**

దేశంలో చాలా మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడం లేదు1952 లో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికల్లో 45 శాతం ఓటర్లు మాత్రమే ఓటు హక్కును విని యోగించారు.2024నాటికి 66.10 శాతం మంది ఓటు వేశారు. కేవలం 22 శాతం మాత్రమే ఓటింగ్ పెరిగింది 72 ఏళ్లలో కేవలం 22% ఓటింగ్ పెరగడం గమనార్హం. మొత్తం ఓటర్లలో 90 శాతం ఓటింగ్ జరిగితే దేశం అభివృధి పథంలో పురోగమిస్తుంద న్న మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వ్యాఖ్య ఓటర్లకు కనువిప్పు కావాలి.. యువత దేశ భవిత దేశ రాజకీయాల్లో యువత క్రియాశీ లకంగా పాల్గొనాలి యువత రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు.ఓటు వేయడం పై ఆసక్తి చూపడం లేదు. సాధారణ ఎన్నికల్లో యువత ఓటింగ్ శాతం గ్రామీణ ప్రాంతాల కంటే తక్కువ వుంటుంది.పట్టణ ప్రాంతా లలో చదువుకున్న వారు ఓటింగ్ పై ఆసక్తి చూపడం లేదు.

**నోటుకు ఓటు ప్రజాస్వామ్యానికి చేటు ప్రజాస్వామ్యానికి ఓటు ఆయుధం**

ఓటరు నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగిం చుకోవాలి. కానీ రాజకీయ పార్టీలు ఓటును అంగడి సరుకుగా మార్చాయి .డబ్బు మద్యం వివిధ ప్రలోభాలకు ఓటును అమ్ముకునే నోటుకు ఓటు సంస్కృతి పెరిగి ప్రజాస్వా మ్యానికి చేటుగా పరిణమించింది.రాజకీయ పార్టీలు ఓటర్లకు డబ్బులుఎరగా చూపి ఓటు వేయించు కుంటున్నారు . దేశంలో రాజకీయ పార్టీలు గెలుపే ఏజెండాగా పోటీ పడుతున్నాయి ధనబలం పెరిగి పోయింది. దేశంలో మధ్యతరగతి ప్రజల సంఖ్య గణ నీయంగా పెరిగింది . రాజకీయ పార్టీలు ఓట్లను అంగడి సరుకుగా మార్చి వేశాయి. రాజకీయ పార్టీలు హామీల హర్రసుపాట పాడుతూ ఓటర్లను వంచిస్తున్నారు.

**పెరుగుతున్న ఎన్నికల వ్యయం**

ఎన్నికల కమిషన్ సూచించిన దాని కంటే ఎన్ని కల వ్యయం చేస్తున్న రాజకీయ పార్టీల మీద నియంత్రణ లేదు.ఈ పరిస్థితులు ప్రజాస్వామ్య వ్యవస్థ స్ఫూర్తికి విఘాతం గా పరిణమించాయి. ఓటును అమ్ముకోవడం ద్వారా ప్రజలు ప్రజా ప్రతినిదులను ప్రశ్నించే హక్కును కోల్పోతారు. ప్రజాసంక్షేమం కుం టుపడుతుంది. దేశ భవిష్యత్తు నాయకుల చేతుల్లో వుంటుంది. ఆనాయకుల తలరాత మార్చేది ఓటు" కాళోజీ అన్నట్లు "అభ్య ర్థి ఏ పార్టీ వాడని కాదు ఏ పాటి వాడో చూడాలి" ప్రజలకు ఇప్పటివరకు ఏమిచే శాడో గమనించి నేరచరిత లేని నిజాయితీ వంతులను ప్రజా ప్రతినిధులు గా ఎన్నుకొని అవినీతి రహిత' నేరరహిత రాజకీయ వ్యవ స్థకు ఓటర్లు ఉద్యమించాలి.

**ఓటు వజ్రాయుధం**

దేశ భవిష్యత్తు అభివృధి ప్రభుత్వాల మార్పుకు ఓటు వజ్రాయుధం లాంటిది. ప్రభుత్వం నిర్బంధ ఓటింగ్ విధానాన్ని అమలు చెయ్యాలి. ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికల ప్రచారంలో చూయిస్తున్న శ్రధకంటే ఎక్కు వగా ఓటింగ్ హక్కు వినియోగం ఎన్నికల విధానం ఎన్నికల అక్షరాస్యత

**ఇవిఎం ల ఉపయోగం మీద ఎన్నికల కమిషన్ దృష్టి పెట్టాలి.**

ఎన్నికల సమయంలో అభ్యర్థులు రాజకీయ పార్టీలు చేసే దేశ పూర్తి సంఘాలను ఎన్ని కల కమిషన్ నిషేధించాలి ప్రజాస్వామ్యాన్ని చేస్తామని హోటల్ ప్రతిజ్ఞ చేసినప్పుడే ప్రజా స్వామ్యం వర్ధిల్లుతుంది బలమైన ప్రజాస్వా మ్యం కోసం ప్రత్యేక సమగ్ర జాబితాల సవర ణలు అందరూ భాగస్వాములు కావాలి

**ఓట్ల నమోదు ఓటింగ్ ప్రక్రియ పై యువతకు శిక్షణ ఇవ్వాలి**

రాజకీయ పార్టీలు యువత విభాగం అధ్వ ర్యంలో ఓటు నమోదు ఓటరు గుర్తింపు ఆధార్ కార్డు తో ఓటరు కార్డు అనుసం ధానం దొంగ ఓటర్ల గుర్తింపు ఎన్నికల అక్షరాస్యత పరివ్యాప్తికి శిక్షణ తరగతులు నిర్వహించి ఓటింగ్ శాతం పెంచడానికి కృషి చెయ్యాలి. ప్రభుత్వం నిర్బంధ ఓటు హక్కును కల్పించాలి. ప్రభుత్వం ఎన్నికల కమిషన్ పౌరసమాజం యువత' మహిళా సంఘాలు' స్వచ్ఛంధ 'సామాజిక సేవా సంస్థలు ఓటు హక్కు వినియోగం పై అవ గాహన చైతన్యం కలిగించాలి. కళాశాలల్లో ఓటు హక్కు వినియోగం మీద సాంస్కృతిక కళా బృందాల ప్రదర్శనల ద్వారా ఓటర్లను చైతన్య పరచాలి ."ఓటర్లు అందరూ తమ ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా సమర్థులైన అభ్యర్థులకు ఓటువేసి ఎన్నుకుంటానని ప్రతిజ్ఞ చెయ్యాలి" అప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ బల్లోపేతం అవుతుంది.

**ప్రలోభాలు వద్దు _ఓటు వినియోగమే ముద్దు**

భారత రాజ్యాంగ పిత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పినట్లు భారత దేశం చారి త్రకంగా వెనుకబడిన వర్గాలు దళితులు ఆదివాసీలు తాడితులు పీడిత వర్గాలు రాజకీయంగా అభివృధి చెందటానికి ఓటు హక్కు ముఖ్యమైన మార్గం అని పేర్కొన్నా రు. ప్రతి ఓటరు ఓటు విలువ తెలుసుకొని ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కు వినియోగించు కోవాలి. ప్రజాస్వామ్యాన్ని గౌరవించడం ప్రజల సామాజిక బాధ్యత. ఓటరుగా వున్నందుకుగర్వపడుతున్న ఓటు వేయడానికి సిద్ధంగా వున్న అనేది నినాదం కాకుండా ఓటర్ల విధానంగా వర్ధిల్లాలి. ఓటు వేద్దాం ప్రజాస్వామ్య పరిపుష్టికి పాటుపడు దాం అని ఓటర్లు ప్రతిజ్ఞ చేయాలి.

**నేదునూరి కనకయ్య**
**అధ్యక్షులు, తెలంగాణ ఎకానమిక్ ఫోరం**
**మాజీ కరెస్పాండెంట్ జస్టిస్**
**కుమారయ్య లా కాలేజీ కరీంనగర్**
**(ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ జస్టిస్ కుమారయ్య 1969 _1971)**
**9440245771**





# ఉచిత శిక్షణకు దరఖాస్తులకు ఆహ్వానం



- **ఈ నెల 30 లోగా దరఖాస్తు చేసుకోవాలి**
- **జిల్లా అడిషనల్ కలెక్టర్ నగేష్**

**మెదక్, జనవరి 24 (ప్రజా స్వరం) :**

గ్రూప్ 1,2,3,4, ఆర్ ఆర్ బి, ఎస్ఐ , కానిస్టేబుల్, ఎస్ ఎస్ సి తదితర పోటీ పరీక్షలకు స్థానిక టీజీ ఎస్సీ స్టడీ సర్కిల్లో ఫౌండేషన్ కోర్సు ద్వారా 5 నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా అడిషనల్ కలెక్టర్ నగేష్ తెలిపారు. శనివారం మెదక్ కలెక్టర్ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి సింధు, స్టడీ సర్కిల్ డైరెక్టర్ బి.శ్రీకాంత్ లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30 వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లా లోని డిగ్రీ పూర్తి చేసి 3 లక్షల లోపు ఆదాయం కలిగిన ఎస్సీ బీసీ, ఎస్టీ అభ్యర్థులు ఆన్లైన్ లో tsstudycercle. co.in లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఫిబ్రవరి 8 న సిద్దిపేట ప్రతిభ డిగ్రీ కళాశాలలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఎంట్రన్స్ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా, మెరిట్ ఆదరంగా ఎస్సీలకు 75, బీసీ లకు 15, ఎస్టీ లకు 10 శాతం సీట్లు కేటాయిస్తారని చెప్పారు. ఇందులో ఫిజికల్ హ్యాండీక్యాప్ అభ్యర్థులకు 5, మహిళా అభ్యర్థులకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తారని చెప్పారు 100 మంది అభ్యర్థులను ఎంపిక చేసి 5 నెలల పాటు ఉచిత రెసిడెన్షియల్ తో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

# వీరభద్ర రైస్ మిల్‌పై విజలెన్స్ అధికారులు తనిఖీలు



**తూప్రాన్, జనవరి 24 (ప్రజాస్వరం) :**

తూప్రాన్ మండలం ఘనపూర్ గ్రామం శివారులో గల వీరభద్ర రైస్ మిల్ లో మెదక్ విజిలెన్స్ ఎన్ ఫోర్స్ మెంట్ , సివిల్ సప్లయి అధికారులు సంయుక్తంగా తనిఖీలునిర్వహించారు వీరభద్ర రైస్ మిల్లులో తనిఖీ చేయగా సుమారు నాలుగు కోట్ల 50 లక్షల ధాన్యం నిలువలు అవకతవకలు జరిగినట్లు నిర్ధారించడం జరిగింది స్థానిక తహసిల్దార్ సమక్షంలో తనిఖీలు నిర్వహించి పై అధికారులకు నివేదిక పంపనున్నట్లు సివిల్ సప్లై అధికారి మీడియాకు వెల్లడించారు రైస్ మిల్ యజమాని అందుబాటులో లేనందున వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని ఆయన అన్నారు. సి.యం.ఆర్ ధాన్యం నిల్వలలో అవకతవకలు జరిగినట్లు అధికారులు నిర్ధారణ.

# పేకాట రాయుళ్ల అరెస్ట్..

**చిన్న శంకరంపేట, జనవరి 24, (ప్రజాస్వరం) :**


చిన్న శంకరంపేట మండలం ఖాజాపూర్ అడవి ప్రాంతంలో పేకాట స్థావరంపై పాస్పోర్ట్ పోలీసులు దాడులు చేశారు, పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుండి 8725 నగదు 4 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు, ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పేకాట బెట్టింగ్ వల్ల కుటుంబాలు నష్టపోతున్నాయని యువత తప్పుదారులు ఎంచుకుంటున్నారని దీని ద్వారా ఆ కుటుంబం మొత్తం అప్పులపాలై రోడ్డున పడుతున్నాయని ఆయన తెలిపారు, నమ్మదగిన సమాచారం మేరకు ఖాజాపూర్ అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో దాడులు నిర్వహించి నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుండి నాలుగు మొబైల్ ఫోన్లతో పాటు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు, ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఆయన ప్రజలకు సూచించారు, మెదక్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ బృందం దాడులు నిర్వహించడం జరిగిందని పేకాట రాయులతో పాటు వారి వద్ద నుండి నగదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని చిన్న శంకరంపేట పోలీస్ స్టేషన్లో అప్పగించినట్లు తెలిపారు. పేకాట ఆడిన వారు నార్సింగ్ మండలం సంకాపూర్ తాండకు చెందిన వారిగా గుర్తించారు వారిలో శంకర్ నాయక్, ప్రకాష్, నేనావత్ అనిల్, బద్రు, ఉన్నట్లు తెలిపారు.

# కడుపు నొప్పితో విద్యార్థి ఆత్మహత్య

**తూప్రాన్, జనవరి 24 (ప్రజా స్వరం) :**

మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణానికి చెందిన కనుకొల్లా గణేష్ (15) అనే ఐటిఐ చదువుతున్నా విద్యార్థి కడుపు నొప్పి భరించలేక ఇంట్లో ఉరివేసుకొని హత్యహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. తండ్రి కనుకొల్లా సిద్ధిరములుపోలీసులకు పిర్యాదు తో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎసై గంగారాజు తెలిపారు.





# బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ, కాంగ్రెస్ నేతలు

**తూప్రాన్ జనవరి 24( ప్రజా స్వరం) :**

మెదక్ జిల్లా గజ్వేల్ నియోజకవర్గం లోని తూప్రాన్ మున్సిపాలిటీ పదో వార్డు బ్రహ్మణపల్లి 8 వార్డు పోతరాజు పల్లి చెందిన బిజెపి కాంగ్రెస్ నాయకులు యువకులు మహిళలు పెద్ద ఎత్తున తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు చేసిన అభివృద్ధి సంక్షేమానికి ఆకర్షితులై గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగింది. వారికి గులాబీ కండువా వేసి బిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ మంత్రి వివేక్ వెంకటస్వామి తూప్రాన్ పర్యటనకు వచ్చినప్పుడు తూప్రాన్ పట్టణం ఏమీ అభివృద్ధి జరగలేదని అబద్ధాలు చెప్పడం హాస్యాస్పదమన్నారు ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తూప్రాన్ పట్టణానికి చేసిన అభివృద్ధి కాంగ్రెస్ మంత్రి వివేక్ వెంకటస్వామి కి కనిపించకపోతే కెసిఆర్ హయాంలో ప్రవేశపెట్టిన కంటి వెలుగు పథకంలో చికిత్స చేయించుకోండి కంటి వెలుగు అద్దాలు ధరించుకొని వస్తే తూప్రాన్ లో జరిగిన అభివృద్ధిని చూపిస్తామన్నారు. కెసిఆర్ గారి హయాంలో తూప్రాన్ పట్టణాన్ని రెవిన్యూ డివిజన్ గా మార్చడం, తూప్రాన్ పట్టణంలో 50 పడకల ఆసుపత్రి నిర్మాణం, డబుల్ బెడ్ రూంల నిర్మాణం, వెజ్ నాన్ వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మున్సిపల్ భవనము, రోడ్డు డివైడర్ మధ్యలో సెంట్రల్ లైటింగ్ మీడియన్, ఆర్ అండ్ బి అతిథిగృహం, ప్రతి గల్లీకి సిసి రోడ్లు, పెద్ద చెరువు కట్టను మినీ ట్యాంక్ బండ్ గా మార్చడం, తూప్రాన్ పట్టణ ప్రకృతి వనం, మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి సురక్షితమైన స్వచ్ఛమైన త్రాగునీరు ఇవ్వడం, రైతు సంక్షేమం కోసం అధునాతమైన వ్యవసాయ మార్కెట్ యార్డ్ మరియు గోదాముల నిర్మాణం, సబ్ రిజిస్టర్ కార్యాలయ నిర్మాణం, తూప్రాన్ పట్టణంలోని జంక్షన్ల సుందరీకరణ, అధునాతన హంగులతో వైకుంఠధామ నిర్మాణం, ఇలా చెప్పుకుంటూ పోతే చాలా అభివృద్ధి కార్యక్రమాలు దాదాపు 200 కోట్ల రూపాయలకు పైగా కేసీఆర్ తూప్రాన్ మున్సిపాలిటీ యొక్క రూపురేఖలను మార్చిన ఘనత కేసిఆర్ ది అని ఆయన అన్నారు అది తెలువక వివేక్ వెంకటస్వామి తమ గత చరిత్ర మరిచి అభివృద్ధి జరగలేదని చెప్పడం చాలా దారుణమని మండిపడ్డారు ఇప్పటికైనా అబద్ధాలు అసత్యాలు ప్రచారాలు చేయడం మానుకోవాలన్నారు లేదంటే తూప్రాన్ పర్యటనకు వచ్చినప్పుడు తూప్రాన్ పట్టణ ప్రజలతో అడ్డుకుంటామని మంత్రి వివేక్ వెంకటస్వామిని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు, కళ్యాణ లక్ష్మి తుల బంగారం, విద్యార్థులకు స్కూటీల పంపిణీ, మహిళలకు 2500 రూపాయలు, రైతుబంధు ఇవ్వడంలో, రైతు చేయకపోవడం, రెండు వేల పెన్షన్ 4000 ఇవ్వకపోవడం, రైతులకు సకాలంలో విత్తనాలు ఎరువులు సరఫరా చేయడంలో విఫలం, రైతులకు సాగునీరు అందించడంలో విఫలం, రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వడంలో ఇలా చెప్పుకుంటూ పోతే కాంగ్రెస్ ప్రభుత్వం అన్నింటిలో వైఫల్యం చెందిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ 70 సంవత్సరాలు పరిపాలన కాలంలో అభివృద్ధి శూన్యం అన్నారు కాంగ్రెస్ హయాంలో అక్కా చెల్లెలు గుక్కెడు నీళ్ల కోసం కిలోమీటర్లు వెళ్లి బిందెలతో నీళ్లు మోస్తే భుజాలు కాయలు కాసేటివని గుర్తు చేశారు నేడు ఆ పరిస్థితి ఉందని ప్రశ్నించారు. రైతులకు 24 గంటల కరెంటు లేక, ఎరువులు లేక విత్తనాలు లేక,



గిట్టుబాటు ధరలు లేక గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆత్మహత్యలు జరిగేవని, నడవడానికి కూడా సరియైన రోడ్డు లేక ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం లో ఇబ్బంది పడ్డ రోజులు వివేక్ వెంకటస్వామి మరిచారని కాంగ్రెస్ పార్టీ అంటేనే అవినీతి అక్రమాలని కబ్జాలు అని అబద్ధాలు అసత్యాలు అని తెలిపారు ప్రజలు మీరు చెప్పే మాటలను ఎవరు నెంబర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల కాలంలో తూప్రాన్ లో మీరు చేసిన అభివృద్ధి ఏమిటని మీరు మంజూరు చేసిన నిధులు ఎన్ని అని మంత్రి వివేక్ వెంకటస్వామిని ప్రశ్నించారు. గతంలోని కెసిఆర్ ప్రభుత్వం తూప్రాన్ పట్టణ అభివృద్ధికి 12 కోట్ల రూపాయలు మంజూరు చేసే మీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 12 కోట్ల రూపాయలను రద్దుచేసి తూప్రాన్ మున్సిపాలిటీ అభివృద్ధిని అడ్డుకున్నది మీ కాంగ్రెస్ పార్టీ కాదా అని ప్రశ్నించారు . అంతేకాకుండా గడ్చిన రెండు సంవత్సరాల కాలంలో తూప్రాన్ పట్టణంలో అవినీతి నాయకులు టాక్స్ ల పేరిట టాక్స్ రుసుమును పెంచి గృహ నిర్మాణాలు చేసుకున్న వారి నుంచి వసూలు చేసి తూప్రాన్ మున్సిపాలిటీలో భారీ అవినీతి కార్యక్రమాలు చేశారని తెలిపారు రాబోయే రోజులలో వడ్డీతో కలిపి అన్ని వసూలు చేస్తామని కాంగ్రెస్ నాయకులను హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా వైఫల్యం చెందిందని ఇందిరమ్మ చీరలు రెండు సంవత్సరాలలో ఎందుకు పంచలేదని కేవలం ఎన్నికలు వస్తే మాత్రమే రైతుబంధు ఇందిరమ్మ చీరలు, క్రిస్టియన్ గిఫ్ట్ రంజాన్ తోఫాలు ఇలాంటివి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలక్షన్లు వస్తే మాత్రమే గుర్తుకు వస్తాయని ఎ ఎద్దవా చేశారు. కానీ తూప్రాన్ పట్టణ ప్రజలు చాలా చైతన్యవంతులని మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ బిజెపి పార్టీలను ఓటు రూపంలో బొందపెడతారని ఆయన హెచ్చరించారు కార్యక్రమంలో తూప్రాన్ మున్సిపాలిటీ ఎన్నికల ఇంచార్జ్ పరిశీలకుడు మచ్చ వేణుగోపాల్ రెడ్డి, మాజీ చైర్మన్ బొంది రవీందర్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు సతీష్ చారి మాజీ ఎంపీపీ హరికృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్, నాయకుల తదితరులు ఉన్నారు.

# పర్యవేక్షణ, సహాయక కమిటీ ఎన్నిక



**చిన్న శంకరంపేట, (ప్రజాస్వరం) :**

చిన్న శంకరంపేట మండలం కొర్విపల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ అంజమ్మ ఆధ్వర్యంలో అంగన్వాడి స్థాయి పర్యవేక్షణ మరియు సహాయక కమిటీ ఎన్నిక నిర్వహించారు, అదేవిధంగా ఈసీసీఈ డే సెలబ్రేషన్ జరుపుకోవడం జరిగింది, ఈ కార్యక్రమంలో సర్పంచ్ పుల్లారావు ఉపసర్పంచ్ నరసింహులు పంచాయతీ కార్యదర్శి సమత అంగన్వాడీ టీచర్ మంగమ్మ ఆశా వర్కర్ యాదమ్మ వివో ప్రతినిధులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# తూప్రాన్ మున్సిపల్‌లో సిద్దిపేట నాయకుల పెత్తనం ఏంటి?



**తూప్రాన్, జనవరి 24( ప్రజా స్వరం) :**

తూప్రాన్ మున్సిపాలిటీలో రానున్న ఎన్నికలలో సిద్దిపేట బిఆర్ఎస్ నాయకుల పెత్తనం ఏంటని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ ఇంచార్జ్ తూముకుంట నర్సారెడ్డి మండిపడ్డారు. తూప్రాన్ మున్సిపాలిటీలోని రెండవ వార్డులో కొక్కొండ దీపక్ రెడ్డి అభ్యర్థి ప్రకటిస్తూ ప్రచారం సాగించారు తూప్రాన్ లో 16 వార్డులలో బీ ఆర్ ఎస్ పార్టీకి స్థానికులు కరువై సిద్దిపేట నుంచి వలస వచ్చిన బి ఆర్ ఎస్ నాయకులు పెత్తనం చలాయిస్తున్నారని ఆయన ప్రశ్నించారు స్థానిక ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యే కెసిఆర్ హౌస్ లో ఉంటూ సిద్దిపేట అల్లుడు హరీష్ పెత్తనం ఏంటి అనిసిద్దిపేటకు చెందిన నాయకులను ఇంచార్జ్ లు గా పెట్టడం పై ఓటమి భయం పుట్టుకుందని ఆయన అన్నారు బి ఆర్ ఎస్ కుటుంబ కలహాలతో చేసిన అవినీతి కెసిఆర్ కూతురు కవితనే బట్టబయలు చేస్తుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి విశ్వరాజ్ చిన్న నాగరాజ్ దీపక్ రెడ్డి కామారం వెంకటేష్తదితరులు ఉన్నారు

# ఉపాధి కూలీల భద్రత మా లక్ష్యం



- **ఉపాధి రహిత చట్టంగా విబీ జీరాంజీ పాలసీ**
- **నూతన విధానాన్ని సవరించే వరకు పోరాడుతాం**
- **కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి**

**ఆదిలాబాద్ జిల్లా, జనవరి 24 (ప్రజాస్వరం) :**

ఉపాధి హామీ కూలీల పొట్టగొడుతూ ఉపాధి లేని చట్టాన్ని కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ తీసుకువచ్చిందని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకుంటూ, కూలీల కనీస వేతనాలపై పోరాడుతామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి పేర్కొన్నారు. బోథ్ మండలంలోని అందూర్ గ్రామపంచాయతీ పరిధిలో గ్రామ సర్పంచ్ పెందుర్ పృథ్వీరాజ్ అధ్యక్షతన గ్రామ ప్రజలతో మన్రేగా సంగ్రామ్ బచావో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి మాట్లాడుతూ నూతనంగా తీసుకువచ్చినటువంటి చట్టంలో 2047 వరకు మాత్రమే ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారని, కనీస వేతనాల్ని రాష్ట్రాలు నిర్ణయించే అధికారాన్ని తీసేసి కేంద్రమైన నిర్ణయిస్తుందని దీనివల్ల తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ వంటి రాష్ట్రాలు నష్టపోతాయని, కనీస వేతన నిర్ణయమండలి ద్రవయోల్బణం స్థాయిని బట్టి నిర్ణయించే అధికారం రాష్ట్రాల దగ్గర ఉందని దాన్ని నూతన చట్టంలో పొందుపరచలేరని విమర్శించారు.ఏ రాష్ట్రాలకు ఎన్ని నిధులు ఇవ్వాలని కేంద్రమే నిర్ణయించుకొని తాము అధికారంలో ఉన్న రాష్ట్రాలకు ఎక్కువ నిధులు కేటాయించే అవకాశం ఉందని దీనివల్ల మిగతా రాష్ట్రాలు నష్టపోతాయని తెలిపారు, ఉపాధి చట్టంలో మహాత్మా గాంధీన పేరు తొలగించినంత మాత్రాన ప్రజల గుండెల్లో నుంచి ఆయన్ని ఆయన ఆశయాలని ఆయన సూచించిన భావజాలాన్ని ఎవరు చెరిపి వేయలేరని తెలిపారు.వి బి జి రామ్ జి చట్టం రద్దయేంతవరకు వివిధ రూపాలలో కాంగ్రెస్ పార్టీ ఆందోళన కార్యక్రమాలు చేస్తూ ఉంటుందని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు, కుచులాపూర్ ఉపసర్పంచ్ సుద్దుల అరుణ్ రెడ్డి, ఆదివాసి కాంగ్రెస్ మండల వైస్ చైర్మన్ ఉమేష్ జాదవ్, మండల సీనియర్ నాయకులు చౌహాన్ దేవిదాస్, గ్రామ పటేల్, పలువురు వార్డు సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999